

# డాడీ...డాడీ...

నా పెళ్లయిన వెంటనే 'వేరు పడటం'తో ముద్దుమురిపాలతో కన్నా... బాధ్యతలతోనే సంసారం మొదలవటం ఒక దురదృష్టం... ఏడాది తిరగ్గానే పిల్లాడు పుట్టుకొచ్చాడు... వాడితో ఖర్చులు పెరిగి పోయాయి.

జీవితంలో ఏం సుఖముంటుందో అర్థం కాలేదు...

ముందు ఇంట్లోకి అన్ని వస్తువులు సమకూర్చుకోవాలి అనుకొని మేమిద్దరం వంట సామాను మొత్తం... గ్యాస్‌స్టవ్, కుక్కర్లు, ఫ్రైపాన్‌లు, గిన్నెల స్టాండు, గ్రైండర్... ఇలా సామానులు తీసుకొని ప్రతి నెల జీతంలో కొంత డబ్బు ఎంటర్ ప్రైజెస్‌లో కట్టుకుంటూ పోతే అది తీరడానికి ఎనిమిది నెలలు పట్టింది...

తర్వాత వికాస్ పుట్టాడు...

వాడి ఖర్చుతో ఏడాదంతా ఏమీ కొన్లేకపోయాం. అప్పుడప్పుడు వచ్చే బంధువులు, స్నేహితులు ముందు రూం బోసిగా కన్పిస్తోంటే ఏమనుకుంటారోనని ఫీలయ్యేవాళ్లం.

ఈ స్థితిలో రంజని నెల తప్పింది.

రంజని ఆ రాత్రి నాతో 'ఏమండీ... వీడు పుడితే మళ్లీ మన ఖర్చులు రెట్టింపవుతాయేమో... ఒక్క పిల్లాడితో సరిపెట్టుకుందామా... అప్పుడు మన ప్రేమలు, మన సంపాదన అంతా వికాస్‌కే దక్కుతుంది' అంది.

నాక్కూడా నిజమేనన్పించింది.

ఎన్నాళ్లుగానో... కలర్ టీవి, ఫ్రిజ్, స్టీరియో, విసిడి లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుక్కోవాలని ఇద్దరం ఆరాటపడుతున్నాం.

ఇంటి కొచ్చిన వాళ్ళు కూడా...

'అయ్యో... మీ ఇంట్లో కలర్ టీవి లేదా...' రోజంతా ఏం చూస్తారు?'

'వ్హాట్... మీరింకా ఫ్రిజ్ తీస్కోలేదా... ఎండా కాలం ఎలా బతుకుతున్నారయ్యా బాబు....'

'సిడిలో దృశ్యం చూసినా... పాటలు విన్నా ఎంత బావుంటాయో తెల్సా...' అంటూ ఏదో మాట తగలేసి పోతూనే వున్నారు. ఈ రోజుల్లో అవన్నీ, కనీస అవసరంగా లేకపోవటం ఇన్సల్టింగ్‌గా ఉంది. అవన్నీ కొనుక్కొని ఉన్న ఒక్క బాబుని గొప్పగా చూస్కుంటే చాలు... అనుకొని

మర్నాడే... అబార్షన్ చేయించాలి.... అనే నిర్ణయానికి వచ్చాం.

ఈ నిర్ణయంతో.... రాత్రి రిలీఫ్‌గా నిద్ర పట్టింది.

వికాస్ లేచాడు...

వాడు పెద్ద అవుతున్నాడు... పెరిగి పెరిగి . . . ఇరవయ్యేళ్ళ వాడంత అయ్యాడు....

"డాడీ. . . డాడీ . . ."

వాడి కళ్లలో ఆగ్రహావేశాలు... చేతిలో ఇనుపకడ్డీలాంటి ఆయుధం...

దాంతో ఇంటోని వస్తువులన్నీ ధ్వంసం చేసాడు.

ఫ్రిజ్... టీవి... స్టీరియో... విసిడి... గ్రైండర్... అన్నీ అన్నీ ధ్వంసం చేసాడు.

"డాడీ..." మరోసారి అరిచాడు.

నేను రేపు చచ్చిపోతున్నాను... అప్పుడు మీకు దిక్కెవరు... ఈ ఎలక్ట్రానిక్ వస్తువుల్లోనే కొడుకుని చూస్కోండి.. నేను చచ్చాక కనీసం మిమ్మల్ని ఓదార్చడానికి

తమ్ముడో, చెల్లెలో కూడా లేరు... రాబోతున్న వాళ్లని మీరే చంపేస్తున్నారు...

ఒంటరిగా ఆడుకోవటం, ఒంటరిగా చదువుకోవటం ఎంత దుర్భరమో తెల్సా... మీ సుఖాల కోసం 'ఒక్కడు చాలు' అనే ఆదర్శమైన ముసుగేసుకొని బతుకుతున్నారు.

బాల్యంలోనే దొరికే తోబుట్టువుల్లోని ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఎంత గొప్ప స్నేహంలోను దొరకదని... మీరు వస్తు వ్యామోహంలో పడి... మర్చిపోతున్నారు.

డాడీ... మీరెంత విడిపోయినప్పటికీ... మీకే కష్టమొచ్చినా మీ అన్నయ్యల దగ్గరికో.. చెల్లెలి దగ్గరికో పరిగెడతావే... మరి.... నాక్కూడా... అలాంటి పరిస్థితులొస్తాయని ఎందుకు వూహించట్లేదు....

నాకు తోడుగా రానున్న చెల్లెల్నో ... తమ్ముడినో కడుపులోనే మీరు ధ్వంసం చేస్తే... మిమ్మల్ని శాసిస్తున్న మీ వస్తువుల్ని నేనే ధ్వంసం చేసాను.. ధ్వంసం చేసాను... అన్నింటినీ తగలబెడుతున్నాను..." భీకరంగా అరుస్తున్నాడు వికాస్.

మంటలు . . .

మంటలు . . .

ఇల్లంతా మంటలు . . .

"వికాస్... వికాస్..."

నా అరుపులకి రంజనీ తట్టి లేపింది. నాకు సడెన్‌గా మెలకువొచ్చింది.

...నా ఒళ్ళంతా చెమటలు...

"ఏమైందండీ... ఏదైనా పీడకలా..." రంజనిలో కలవరం.

తల త్రిప్పి చూసాను.

ఏడాదిన్నర వికాస్.... ముద్దుగా బొద్దుగా... ఉట్టిపడే పసితనంతో నిద్ర పోతున్నాడు.

వాడి బుగ్గలపై ముద్దెట్టుకున్నాను.

"వాడికేమైనా అయినట్లు పీడకలొచ్చిందా" అడిగింది రంజని

"కాదు... వాన్ని ఒంటరిగా చేసినందుకు వాడే మనల్ని శిక్షించినట్లు కలొచ్చింది..."

రంజని అయోమయంగా చూస్తోంది.

కొద్ది సేపటి తర్వాత

"అబార్షన్ క్యాన్సిల్" అన్నాను ధృఢంగా... రంజనికి ఏమీ అర్థం కాలేదు.

"ఎందుకు?" అంది.

అప్పుడే ఫోన్ మోగింది. వెళ్లి ఎత్తాను. "రంజనీ... మీ అన్నయ్య ఫోన్..." అని పిలిచాను. అన్నయ్య అనగానే... రంజని మొహం వెలిగి పోయింది.

ఫోన్ దగ్గరికి పరిగెత్తుకొచ్చింది.

"ఇదుగో" అంటూ ఫోన్ అందించాను.

*